

# భోషాణం

## అట్టాడ అప్పల నాయుడు

నైరుతీ మూల కిచెన్ కమ్ డైనింగ్ హాలుకి పోగా, ప్రక్కగా మిగిలిన స్థలాన్ని స్టోర్ రూం చేసారు. దానికి తలుపూ ద్వారాలు లేవు. తలుపూ ద్వారాలు లేని స్టోర్ రూంలో - రిపేరుకి వచ్చి షెడ్డులో వుండిపోయిన గూడ్స్ పెట్టెలా, ఒక భోషాణం ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి వుంది.

ఖైదులోనున్న ఆత్మీయుణ్ణి పరామర్శగా చూసేట్లు ఆ భోషాణాన్ని చూస్తోంది. బహుదా! చూడగా, చూడగా భోషాణం బయట నున్నట్టూ, తను స్టోర్ రూములో నున్నట్టూ భావన కలిగింది బాహుదాకు.

"స్టోర్ రూములో - ఆ పాతపెట్టె ఏవిటండీ? గెస్టులు ఎవరొచ్చినా దానిమీద జోకులే. తవ్వకాలలో దొరికిన పూర్వీకుల సంపద పెట్టె కాదుగదా అంటారు! ఎందుకూ పనికిరాదు! వడ్రంగాయన్ని రమ్మన్నాను, ఎంతకో కొంతకి అమ్మేద్దాం!" విసుగ్గా కోడలు చెప్పటమూ; కొడుకేమో "మంచిదేగానీ, మా అమ్మకోసారి చెప్పేసి, తర్వాత అమ్ముదామనడమూ" బాహుదా విన్నది. నిన్న సాయంత్రం ఈ సంభాషణ జరిగింది. అంతకుముందు కొన్నిసార్లు - ఆ భోషాణం గురించి విసుక్కునేవాళ్ళు; గానీ అమ్మకం గురించి మాటాడలేదు. పురావస్తువులకు గిరాకీ ఇప్పుడొచ్చిందని - వాళ్ళకెలా తెల్సిందో మరి!

బాహుదాకూ - భోషాణంకూ బంధం అర్థశతాబ్దం కాలం నాటిది. కాపురానికి అత్తవారింటికి వచ్చినపుడు సారెగా కన్నవారిచ్చేరు. ఆ రోజుల్లో ఆ పెట్టె - ఎంతో ఘనం. ఇరిడి కర్రతో చేసిన పెట్టె. పెట్టె లోపల చిన్నా, పెద్దా అరలూ; చిన్న చిన్న పెట్టెలు మరికొన్ని ఆ అరల్లో అమర్చినారు. చక్కని నగిషీలు చేసారు. పెట్టె చుట్టూ, కంచురేకు బద్దెలు, అల్యూమినియం బోల్టులు, చూడముచ్చట గొలిపేది.

బాహుదా దాంపత్య జీవితంలో - ఆ భోషాణంతో ఎన్నో అనుభూతుల్ని మూటగట్టుకుంది. భోషాణం మీద కూచుని భార్యాభర్తలు అనేక కబుర్లు కలబోసుకునేవారు. అనేక విషయాలు చర్చించుకునేవారు. బాహుదా భర్త రాఘవయ్య గారు, ఆ భోషాణమ్మీద కూచొని - ఉప్పల లక్ష్మణ రావుగారి 'అతడు - ఆమె' గురజాడ వారి 'కన్యాశుల్కం', శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' వగైరాలు, చదివి విన్పించేవాడు.

"నిజంగానే మెదడొక విజ్ఞాన భోషాణమే" అని భర్తను మెచ్చుకునేది బాహుదా.

ఒక్కోసారి, కబుర్లతో అలా భోషాణం మీదనే ఒక బొంత పరుచుకుని, నిద్రపోయేవారు. భోషాణాన్ని చూస్తే రాఘవయ్యగారి జ్ఞాపకాలు స్మరణ కొస్తాయి బాహుదాకు!

"...అత్తయ్యా భోజనం" కోడలి పిలుపు. కాదు కేక విన్పించింది. బరువుగా నిట్టూర్చి, స్టోర్ రూము నుండి డైనింగ్ హాలుకి నడిచింది బాహుదా. అప్పుడే హాలులో గోడ గడియారం 'కేర్' మంటూ చంటి పిల్లాడి ఆర్తనాదాన్ని విన్పించింది. రాత్రి ఎనిమిదయ్యింది.

గోడ గడియారపు గంటల శబ్దాన్ని వినీ, లెఖ్ఖపెట్టడం బాహుదాకెంతో ఇష్టం. విజయనగరంలోని "గంటస్తంభా"న్ని ఎన్నిసార్లో చూడ్డానికి వెళ్ళింది. ఇదేమిటో, ఈ గడియారం? గంటల లెఖ్ఖా తెలీదు, శబ్దమూ – చంటి పిల్లాడి ఏడుపు! గంటకోసారి – ఆ ఏడుపు వినలేకపోతోంది బాహుదా.

భోం చెయ్యటానికి కూచుందేగానీ, మనస్కరించటంలేదు.

"ఇంకా ఎవరూ తిన్లేదు గావాల? పిల్లలూ, బాబూ..." గొణిగింది బాహుదా.

"ఆయనెప్పుడొస్తారో? పిల్లలు తింటార్లెండి" అనేసి కోడలు డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళిపోయి, టీ.వీ రిమోట్ అందుకుంది. ఆమె చేతిలో ఛానల్స్ ఛక ఛకా, చచ్చినట్టు మారుతున్నాయి.

బాహుదా, మెతుకులు లెక్కబెట్టుకు తినసాగింది, ఒంటరిగా.

పగటి పూట కంటే, రాత్రిపూట భోజనాలంటే – ఇంటిల్లిపాదితో సందడిగా వుండేది తన పుట్టినింట.

## సగం లోనే
## ఆగిపోయిన పాట

అలనాడెప్పుడో
ఓ ఉషోదయాన్న నన్ను నిద్ర లేపి
ఒక కూని రాగాన్ని బహూకరించేవు
అప్పుడనుకోలేదు సుమా
అదే ఓ పాట పల్లవిగా
పరిఢ విల్లుతుందని
ఓ సాయంకాలపు నీ రెండలో
కడలి ఒడ్డున కూర్చొని
అలలు లెక్క పెడుతున్న సమయాన
నా చెవిలో ఏదో గుసగుసలాడేవు
అదొక అపురూప చరణంగా
రూపుదిద్దుకుంటుందని
ఊహించనే లేదు
తీరా ఆ పదాలన్నీ ఒకచోట చేర్చి
మురిసి పోతూ
ఓ సుమధుర రాగాన్ని
వాటి కద్దే ప్రయత్నం చేస్తుంటే
అకస్మాత్తుగా నువ్వు అదృశ్యమైపోయావు
పదాలు చెదిరి పోయాయి
రాగం కరిగి పోయింది
నే నొక్కడినే రెక్కతెగిన పక్షిలా
గిరికీలు కొడుతూ
ఆ అసంపూర్ణ పాట కోసం
నీ అపురూపమైన తోడు కోసం
ఆర్తిగా ఎదురు చూస్తున్నాను.

–ఆదూరి వెంకట సీతారామమూర్తి
9441940653

బాహుదాకు ఆ రోజులు గుర్తుకొచ్చేయి....


బాహుదా తన ఈడు గల పిల్లల్తో, ఆటపాటల్లో వుంటే – తల్లి కేకేసేది భోజనానికి రమ్మని. పిలిచిన వెంటనే వెళ్ళక, మారాము చేయడం ఇష్టం. కాసేపటికి తల్లి వచ్చి బ్రతిమాలి తీసుకు పోయేది. అన్నదమ్ములు గూడా, భోజనాల వేళకు చేరిపోయేవారు. వంటగదికీ, ఇంటి లోపలి గదులకూ మధ్య మండువా వుండేది. మండువాలో, వరుసగా పీటలు వేసి కూర్చునేవారు. పీటల కోసం, స్థలం కోసం, సోదరుల్తో గిల్లికజ్జాలు పెట్టుకునేది బాహుదా. తండ్రి ప్రక్కన స్థలం బాహుదాదే ఎపుడున్నూ! తండ్రికి ఆమె ఆరో ప్రాణం. ఆ ప్రాంతంలో తనకిష్టమైన నదిపేరును, కూతురికి పెట్టాడు – అదే బాహుదా.

సోదరులు కూరల కోసం, పెరుగు ముద్దల కోసం – వంతులాడటం, తల్లిదండ్రుల లాలింపులు, ఏవేవో కబుర్లు చెప్పుకోవడం – వెన్నెల రాత్రుళ్ళయితే, ఎంతకీ తేలేవిగావు భోజనాలు!

మెట్టినింట గూడా , రాత్రి భోజనాలంటే – అదో అపురూప సందర్భంగా ఉండేది బాహుదాకు. కొద్ది కాలమే, అత్తవారింట వుండినారు. తర్వాత ఉద్యోగ రీత్యా మరో ఊరికి కాపురాన్ని మార్చినాక – బాహుదా, బాహుదా భర్తా ముద్దకో ముచ్చటగా ముగించేవారు భోజనాలు. ఎదురెదురు పీటల మీద కూర్చుని – కూరలూ, పచ్చళ్ళూ, అన్నమూ – కబుర్లూ కలుపుకు తిన్నారో, వొకరి కొకరు తినిపించుకున్నారో...!

జ్ఞాపకాలు... మనసు బాధగా మూలిగింది. మజ్జిగ పోసుకు తినగలనేమో అనుకొని బాహుదా మజ్జిగ గిన్నె అందుకోబోయింది.

"రాత్రిపూట మజ్జిగ మంచిది కాదోయ్ పాలు వేసుకో కావాలంటే" భర్తరాఘవయ్య గారి మాటలు గుర్తొచ్చాయి




బాహుదానైతే ఆపగలిగాడు గానీ, కొడుకుల్ని ఆపలేక పోయాడు రాఘవయ్య. పెద్దకొడుకు – మజ్జిగ పోస్తేగానీ భోజనం ముగించేవాడు కాదు. చిన్న కొడుక్కి – అన్ని పూటలా మజ్జిగ అన్నమే కావాలి!

అదేమిటో? ఇద్దరు కొడుకులూ, తండ్రి ఆలోచనలకూ, అభిరుచులకూ భిన్నంగా...!?

"ఒక కూతురుంటే ఎంత బాగుణ్ణో..." రాఘవయ్య

"నన్నే కూతురిగా లాలించండి..." బాహుదా!

బాహుదా కళ్ళల్లో నీళ్ళు చేరాయి. మరి తినలేక కంచంలో చేయి కడిగేసింది! అప్పుడొచ్చింది కోడలు!

"రేపట్నించి, రాత్రి భోజనం వద్దమ్మా..." చెప్పింది బాహుదా.

కోడలు విచిత్రంగా చూసి మౌనంగా హాల్లోకి వెళ్ళిపోయింది. బాహుదాకు ఇక ఏం చేయాలో తెలీటం లేదు. అంత తొందరగా నిద్ర రాదు. మనవడూ, మనవరాళ్ళతో కబుర్లాడుదామంటే – వాళ్ళు స్టడీరూమ్‌లో హోమ్‌వర్క్ చేస్తున్నారు. టీవీ ముందు కూర్చోవాలంటే – కోడలు ఏవేవో పరభాషల ఛానెల్స్ పెడుతుంది. పోనీ ఆమెతో ముచ్చట్లు పెట్టుకుందాము అంటే – విషయమే దొరకదు బాహుదాకు! ఇరుగూ, పొరుగూ ఏమో – ప్రహరీల బ్రాకెట్లలో బ్రతికే జీవుల ఫోష్ లొకాలిటీ అది! గ్రహాంతరవాసుల మధ్య నున్నట్టుంటుంది బాహుదాకు.

బాహుదా బరువుగా అడుగులు వేసుకుంటూ పిల్లల స్టడీరూమ్‌కి నడిచింది! ఆ గదిలోనే – ఆమె పడక గూడా! నిద్ర రాదని తెలిసే మంచమ్మీద వాలింది. పిల్లలు అప్పుడే హోంవర్క్ పూర్తి చేసారేమో పుస్తకాలు సర్దేసి వేళ్ళు విరుచుకుంటున్నారు.

"నానమ్మా, టీవీలో యేదొస్తోంది?" అని మనవడు ప్రశ్నించాడు. జవాబు వినకుండానే టీవీ దగ్గరకు అంగలు వేసాడు.

మనవరాలు బాహుదా దగ్గరికొచ్చి –

"డాడీరాలేదు గదా నానమ్మా? డాడీ, యెపుడూ ఇంతే. రికార్డ్‌బుక్స్ తెస్తామన్నారు! ఇప్పటికీ రాలేదు! టైం మెయిన్‌టెయిన్ చెయ్యరు" విసుక్కుంది.

బాహుదా ఆశ్చర్యపోయింది. కాలంపట్ల అంత కేలిక్యులేటెడ్‌గా వుంటోందా రేపటి తరం? తన పిల్లలూ, నేటితరమూ మానవ సంబంధాల పట్ల కేలిక్యులేటెడ్‌గా వుంటున్నారని బాధపడేది. ఒకనాటి సంభాషణ గుర్తుకొచ్చిందామెకు.

"రిటైరయినాక ఇంకా ఈ ఊళ్ళో ఎందుకు నాన్నా?"

"ఈ ఊరితో పాతికేళ్ళ అనుబంధం"

"అది ఉద్యోగ బంధం! అయిపోయిందిగా"

"ఈ ఊరు నాకు వ్యక్తిత్వాన్నిచ్చింది. బతుకునిచ్చింది. నాకూ, నా భార్యాబిడ్డలకూ ఇంత భుక్తినిచ్చి పోషించింది. అందుకే శేషజీవితం – ఈ ఊరికోసం..."

రాఘవయ్యగారు, గ్రామసేవా సంగం పెట్టారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల కోసం సంగం ద్వారా కృషి చేసారు. గ్రామీణాభివృద్ధికి చేయాల్సిన పథకాలను – ప్రభుత్వం నుంచి అమలు చేయించేవారు. గ్రామ ప్రజల బాధ్యతల నిర్వహణను – ప్రజల నుంచి ప్రతి ఒక్కరూ నిర్వహించేట్లు చూసేవారు. గ్రామ ప్రజల మధ్య వైషమ్యాలను, సామరస్య పూర్వక ధోరణిలో పరిష్కరించేవారు. గ్రామ పెత్తందార్ల దోపిడీ, పీడనలకు స్థానం లేకుండా చేసారు. గ్రామమనే ఉమ్మడి కుటుంబంలో మానవీయ సంస్కృతి కొరకు – సంగాన్ని నిత్య జాగరూకతతో నడిపేవారు.

ఇదంతా – కొడుకులకు నచ్చేది కాదు. మంచి కార్యక్రమాలే గానీ, సమాజం మంచిని స్వీకరించే దశలో లేదనేవారు. సమాజం మొత్తాని కొరకు అన్న స్థానంలో – వ్యక్తి కొరకు అన్న భావన చేరిందనేవారు. సారాంశంలో – సమాజోద్ధరణ రాజ్యకర్తవ్యమనీ, వ్యక్తి ఆ కర్తవ్య నిర్వహణ చెయ్యలేడనీ అనేవారు.

రాఘవయ్య – చర్చించేవారు కాదు. తన కర్తవ్యంలో తాను...! కొడుకులు – ఉద్యోగాల రీత్యా ఊరొదిలేసారు. రెండు మూడేళ్ళు – రాకపోకలు తగ్గించేసారు. చిన్న కొడుకు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో, పెద్దకొడుకు తెలుగు నేలలోనే ఒక నగరంలో! మూడో ఏట కొడుకులిద్దరికీ పెళ్ళిళ్ళు జరిపించేరు రాఘవయ్య గారు. తన రిటయిర్మెంట్ సందర్భాన వచ్చిన డబ్బుని రెండు సమాన వాటాలేసి – ఒక వాటా సొమ్ముని ఇద్దరు కొడుకులకూ సమానంగా పంచేసి; మరొక వాటాని బాహుదా పేరన బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి; నెలనెలా దానిమీద వచ్చే వడ్డీతోనూ, పెన్షన్‌తోనూ – తమ కాపురం నడిపేవారు రాఘవయ్య! కొడుకులిద్దరికీ – ఇదంతా విచిత్రమన్పించేది.

ఏది తమ మధ్య దూరాన్ని ఏర్పరిచిందో – వారికి తెలిసేది కాదు. దురదృష్టవశాత్తూ, రిటైరయిన అయిదో యేట, గ్రామ సేవాసంఘం విజయవంతంగా తన

కర్తవ్యం నెరవేరుస్తున్న దశలో హెపటైటిస్ – బి వ్యాధి సోకి రాఘవయ్య గారు ఆకస్మికంగా మరణించారు.

అప్పుడు, ఇక గ్రామంలో బాహుదా ఒక్కరే ఎందు కుండాలన్న ప్రశ్నతోనూ, భర్త జ్ఞాపకాలనించి మళ్ళిన ట్లుగా వుండటానికన్న ఆలోచనతోనూ – బంధువులూ, పిల్లలూ వొత్తిడి చేయగా బాహుదా గూడా అంగీకరించి ఆ గ్రామం నుంచి పెద్ద కొడుకు ఇంటికి చేరింది.

కొడుకూ, కోడలూ బ్రతుకు పందెంలో పరుగులు! ఇద్దరూ నౌకరీలకు పోతే చంటి పిల్లల్ని సాకేది బాహుదా. గత స్మృతుల్లో బతకడం తప్ప, వర్తమానంలో సంభాషణే కరువయ్యిందామెకు. ఎపుడన్నా సంభాషణ – ఏదో అవసరం పడితేనే...!

ఓ సందర్భంలో రియలెస్టేట్ వారెవరివద్దో ఒక ప్లాట్ కొన్నాక బిల్డింగ్ నిర్మాణంలో దిగిన కొన్నాళ్ళకు –

"అమ్మా! ఆ పల్లెటూరిలో ఇల్లు అమ్మేస్తేనో?" కొడుకు

"ఖాళీగా ఇల్లుంచేస్తే పాడయిపోతుంది. పల్లెలోన అద్దెకెవరూ ఇల్లు అడిగేవారు లేరు. ఎన్నాళ్ళలా ఇంటిని వొదిలేస్తారు..." కోడలు

"నేనిక్కడ ఎన్నాళ్లుంటాను" ప్రశ్నించింది బాహుదా.

"ఇక్కడగాక, అక్కడెందుకుంటావు?" ఆశ్చర్యపోయాడు కొడుకు

"ఇక్కడ మాత్రం ఎందుకుండాలి నాయనా? కారణం చెప్పు??" నిష్ఠూరంగానే అడిగేసింది బాహుదా.

అక్కడితో సంభాషణ ఆగిపోయింది. ఆ తర్వాత కొద్దినాళ్ళకు – బిల్డింగ్ పనులూ ఆగిపోయాయి. కొడుకూ, కోడలూ ఏవో ఖర్చులు లెఖ్ఖల, తగవులు. పిల్లల్ని కసురుకునేవారు. ఇంటిలో – ఎవరితో ఎవరూ మాట్లాడటం లేదు. తగవులాడేవారు.

బాహుదా, ఊరువెళ్ళి ఇంటిని తనఖా పెట్టి, డబ్బు తెచ్చిచ్చింది. అక్కడ సామానంతా తెచ్చేసింది. అపుడే, భోషాణం తెచ్చుకుంది.

బిల్డింగ్ పనులు మళ్లీ కదిలాయి. బిల్డింగ్‌లో గదుల ఏర్పాటూ, అలమరల ఏర్పాట్ల నుంచే వసారాలో మొక్కల దాకా ఎక్కడా బాహుదా అభిప్రాయం వారితో కలిసేదికాదు. తన అభిప్రాయాలు గానీ, అభిరుచులు మాత్రమే కాదు; తన అనుభవాలు సహితం అక్కరకు రానివిగా – తన కొడుకు తరం భావిస్తోందని గ్రహించింది బాహుదా.

కానీ – ఇప్పుడు మనుమరాలు, ఇంకా ముందుకు పోతోంది. తల్లీ, తండ్రీ, మనుషులెవరితోనైనా, వ్యావహారిక బంధువులే తప్ప, మరేమీ అఖ్ఖర్లేద నుకుంటోంది. మనుమరాలివేపు, దిగ్భ్రమగా చూడసాగింది బాహుదా.

మమ్మీ భోజనానికి పిలుస్తోందంటూ వెళ్ళిపోయింది మనమరాలు. బాహుదా గూడా మంచమ్మీంచి లేచి హాల్లోకి నడిచింది.

పిల్లలిద్దరూ కంచాలు పట్టుకొని, టీవీ ఎదురుగా వచ్చి చూస్తూ తింటున్నారు. ముద్ద, ముద్దకో ఛానల్ మార్చుతున్నారు. భోజనాన్ని ఎంజాయ్ చెయ్యటం కాదు, టీవీ ఛానల్స్‌ని ఎంజాయ్ చేస్తున్నారు వాళ్ళు! బాహుదాకు అక్కడ నిల్చోబుద్ధి వెయ్యలేదు. వెనక్కి వచ్చి మంచమ్మీద వాలింది.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. కొడుకు వచ్చాడేమో – అనుకుంది బాహుదా. కోడలు వీధి తలుపు తీసినట్లుంది. ఎవరో –

"బాహుదమ్మగారున్నారా?" అనడిగేరు కోడల్ని. బాహుదా గభాల్న లేచి వచ్చింది. ఆ వచ్చినవారు ఇద్దరు యువకులు, వారు బాహుదాను చూసి, నమస్కరించి –

"రాఘవ మాస్టారి దశాబ్ది సంస్మరణ సభ పెడ్తున్నాం. గ్రామంలో మాస్టారి పేర్న గ్రంథాలయం నిర్మించారు. దాన్ని సంస్మరణ దినాన ప్రారంభించాలి మీరు! కర పత్రాలూ, పోస్టర్లు వెయ్యాలి. మీ అనుమతి కోసం వచ్చాం మేము" అని తమ రాక కారణాన్ని చెప్పాడో యువకుడు.

పదేళ్ళు గతించాయా – తన రాఘవుడు తనకు దూరమయి..? దశాబ్ది సంస్మరణ చేస్తున్నారు – బాహుదా ఆశ్చర్యపోతోంది.

"మాస్టారు మా గ్రామానికి వెలుగుబాటు చూపారు. కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, ఓటర్లుగా విడిపోయిన మనుషుల్ని ఐక్యం చేసారు." చెప్పుకు పోతున్నాడు ఒక యువకుడు ఉత్తేజంగా.

"పల్లెల్లో పరోపకారం, అందరికోసం ఆలోచించటం అనేవి చెల్లుబాటవుతాయి గానీ, పట్నాల్లో, నగరాల్లో పనికి రావండీ. ఇక్కడ ఎవరి దారి వారిదే..." అంది కోడలు.

ఆ యువకులు వాదించలేదు, నవ్వి ఊరుకున్నారు. బాహుదా అనుమతి తీసుకున్నారు. సంస్మరణ సభ రోజున ఉదయాన్నే జీపు తీసుకు వస్తామని చెప్పి వెళ్ళిపోయారు.

బాహుదా మనసంతా – ఆ గ్రామమూ, రాఘవయ్యతో గ్రామంలో కొన్ని జ్ఞాపకాలూ ముసురుకున్నాయి. మౌనంగా పడకగది చేరింది.

***

స్టోర్ రూమ్‌లోంచి హాలులోకి తీసుకొచ్చిన భోషాణాన్ని చుట్టూ తిరుగుతూ పరిశీలిస్తున్నాడు వడ్రంగి. ఇంకోవైపు భోషాణం ఖరీదును మనుసులోనే అంచనా వేసుకుంటూ –

"గొప్ప పనితనం కన్పిస్తుందమ్మా. చెప్పకేం, ఈ పనితనం ముందు – ఇప్పటివాళ్ళ పనితనం బలాదూర్. ఓల్డ్ ఈజ్ గోల్డ్‌ని – వొట్టినే అన్లేదు పెద్దలు.

అయితొకటే కలప గదమ్మా? కాలం గడిచిన కొద్దీ వీకయిపోద్ది. చూడండి – అరలూ, గిరలూ పట్టు వొదిలేసాయి. చెద గూడా పట్టేస్తుంది.

దీనిమీద పెట్టుబడి పెట్టి మళ్ళీ కొంత వర్కు చేస్తే గానీ పెట్టె పనికిరాదు. అయినా పాతకాలపు పెట్టె ఎవరు కొంటారమ్మా ఇపుడు? ఈ పెట్టెకి కాదు, పనితనానికి విలువిచ్చి కొనాలి. అంతే!" అని భోషాణం వెల పెద్దగా వుండదని పెదవి విరిచాడు.

అప్పుడే గదిలోంచి బయటికొచ్చిన బాహుదా – "నాయనా ఆ పెట్టె బేరం పెట్టడం లేదు. నువ్విక వెళ్ళిపో" అని చెప్పింది వడ్రంగికి. కొడుకూ, కోడలూ ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూసారు.

"ఈ భోషాణం, నా బొందితోపాటూ బుగ్గిగావాలి అంతే. అప్పటిదాకా నాతోనే వుంటుంది" చెప్పింది బాహుదా.

"అది కాదమ్మా" కొడుకేదో చెప్పబోయాడు.

"పెదబాబూ, నేను కోపంతో ఆ మాటన్లేదు. నాకూ ఆ పెట్టెకూ అలాంటి అనుబంధం. అది మీకర్థం కాదు, దానికోసం స్థలం దండగవుతోంది మీకు. అంచేత మీకు ఇబ్బంది కలగకూడదనే – ఆ పెట్టెను నాతోపాటు తీసుకువెళ్తాను..." సౌమ్యమైన గొంతుతో చెప్పింది బాహుదా.

ఆమె చివరిమాట అర్థంగాక, కొడుకూ, కోడలూ ఇద్దరూ "అంటే?" అని ప్రశ్నించారు.

ఇంతలో – గ్రామం నుంచి ఇద్దరు యువకులు జీపు తీసుకొని వచ్చారు. వాళ్ళకు ఆ భోషాణాన్ని – జీపు వెనక భాగాన జాగ్రత్తగా ఎక్కించమని చెప్పింది. వాళ్ళు భోషాణాన్ని జీపు వెనక కుదిర్చి, వాళ్ళతో పెట్టెను రాడ్లకు కట్టారు. బాహుదా తన బట్టలూ, ఇతర చిన్న చిన్న సరంజామా రెండు బ్యాగుల్లో సర్దేసి వుంచింది. వాటినీ జీపులో పెట్టించింది. ఆ తర్వాత కొడుకి దగ్గరగా వచ్చి –

"బాబూ! నాకిక్కడేమీ తోచడం లేదురా. నాకూ మీకూ బోధపడని దూరం! కన్నపేగుల మధ్య కూడా యోజనాల దూరం వుండే కాలం వస్తుందని – ఆ భోషాణమ్మీద కూర్చొని మీ నాన్న ఏవేవో భోగట్టాలు చెప్పేవాడు. అలా అని మిమ్మల్ని తప్పు పట్టడం లేదు. మీరు నాకేమీ తిండికీ, గుడ్డకీ లోటు చెయ్యలేదు.

ఎందుకో ఆ గ్రామానికి నాకూ దూరం లేదనిపిస్తోంది. నా పేర్నగల ఫిక్స్‌డ్ డిపాజిట్ చెల్లుజేసి ఇంటి తనఖా విడిపించుకుంటాను. పెన్షన్ డబ్బులు బతకడానికి చాలు.

మీ మీద ధ్యాస కలిగిన్నాడు మీరు పిలవనఖ్ఖర్లేదు. నేనే పరుగెత్తుకొస్తాను! జాగ్రత్త నాయనా పిల్లలూ, మీరూ..." మరి మాట్లాడలేక జీపు ఎక్కేసింది బాహుదా.

క్షణాల్లో జీపు ఆ ఇంటి మలుపుదాటిపోయి, కనుమరుగైంది. నిశ్చేతనంగా నిల్చున్నారు బాహుదా కొడుకూ, కోడలు.

*

రచయిత సెల్: **9440031961**

